క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కొడవలూరు: మండలంలోని దక్షిణ గండవరం తాటాకులదిన్నెలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన వారికి వంద రోజులు పని కల్పించడం జరుగుతుందన్నారు. సాగునీటి కాలువలు బాగు చేసి రైతులకు మేలు చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో టీఏ రియాజ్, ఎఫ్ఏ రమణయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



కిట్లను అందజేస్తున్న ప్రిన్సిపల్ సుజాత

విడవలూరు: స్థానిక పీఆర్‌ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ బి.సుజాత ఆధ్వర్యంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో సెమిస్టర్ విధానం, ప్రయోగశాలలు, పరీక్షలు, లైబ్రరీ వినియోగం, జేకేసీ శిక్షణ, జాబ్‌మేళా, క్రీడలు తదితర అంశాల గురించి విద్యార్థులకు వివరించామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎస్.మధు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

వేళాంగణిమాత మహోత్సవాలు ప్రారంభం



చర్చిలో ప్రార్థనలు

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు వేళాంగణిమాత (మరియమాత) జన్మదిన మహోత్సవాలు చర్చి డైరెక్టర్ ఫాదర్ లూకా సూరజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పలువురు దైవ సేవకులు 'మరియమాత – రక్షణ సహకారిణి' అనే అంశంపై భక్తులకు సందేశాన్ని అందించారు. సాయంత్రం మరియమాత తేరు ప్రదక్షిణ ముత్యాలపొత్తు పిడుగూ మహాలక్ష్మీపురం వరకు సాగింది. భక్తులు విచ్చేసి ప్రార్థనల అనంతరం కోడూరు బీచ్‌లో సముద్ర స్నానాలను ఆచరించారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

విరాళాల సేకరణ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: విజయవాడలో వరద కారణంగా నిరాశ్రయులైన వారి కోసం సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ముందుకొచ్చి సాయం చేయాలని కోరారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న న్యాయమూర్తి వాణి

బుచ్చిరెడ్డిపాళెం (టౌన్): నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సును న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ర్యాగింగ్, గుడ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, బాలల హక్కులు తదితరాలపై సీనియర్ సివిల్ జడ్జి వాణి అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ శంకరయ్య, ఉపాధ్యాయుడు జోషీ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



నెల్లూరు(అర్బన్): పేదలకు ఐదు బస్తాల బియ్యాన్ని అందజేసేందుకు గాను రూ.7,500 చెక్కును ఎల్ఐసీ సీబీ బ్రాంచ్ కార్యాలయ మేనేజర్ ప్రసన్నకుమార్‌కు ఏటీఏ నేతలు శుక్రవారం అందజేశారు. నగరంలోని మినీ బైపాస్ రోడ్డులో ఉన్న కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏటీఏ నేత నరసింహారావు మాట్లాడారు. ఎల్ఐసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని డివిజన్‌లోని ఉద్యోగులు, ఏజెంట్లు కలిసి వంద బస్తాల బియ్యాన్ని అభాగ్యులు, అనాథలకు ఏటా అందజేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఈ మొత్తాన్ని ఇచ్చామని వివరించారు. నేతలు రాజు, రమేష్‌బాబు, దేవకొండ శ్రీనివాసులు, రమణయ్య, వెంకటేశ్వర్లు, శివకుమార్, పెంచలయ్య, రజనీకాంత్, వెంకటయ్య, అశ్వనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి శోభ

సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాల్లో వినాయక చవితి శోభ సంతరించుకుంది. శనివారం పండగ సందర్భంగా ప్రధాన కూడళ్లలో విగ్రహాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం పూలమార్కెట్లు, దుస్తుల షాపులు, నిత్యావసర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.



పొదలకూరు: బొజ్జ గణపయ్య విగ్రహాన్ని తరలిస్తూ..

• కోలాహలంగా గణపయ్య విగ్రహాల తరలింపు

పొదలకూరు: వినాయక చవితి పర్వదినం సందర్భంగా పొదలకూరు పట్టణం నుంచి శుక్రవారం గ్రామాలకు గణపయ్య ప్రతిమలను కోలాహలంగా తరలించారు. నెల్లూరు రోడ్, పద్మావతి నగర్‌లలో భారీ విగ్రహాలను తయారు చేశారు. ప్రతి సంవత్సరాలానే ఈసారి భక్తులు విగ్రహాలను ఆటోలు, ట్రాక్టర్లలో తరలించుకెళ్లారు. యువత పోటీపడి అతిపెద్ద విగ్రహాలను కొనుగోలు చేసి తరలించారు. స్వల్పంగా కురిసిన వర్షం వల్ల విగ్రహాలకు తరలింపునకు ఆటంకం కలగకుండా కవర్లను కప్పారు.

➡ పట్టణంలోని పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాగార్జున పబ్లిక్ స్కూల్లో ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలను చేశారు. ప్రిన్సిపల్ లక్ష్మీదుర్గ, డైరెక్టర్ చంద్రశేఖర్, పావయ్య, డీన్ కృష్ణ పాల్గొన్నారు. ఇంకా అమరావతి, గాయత్రి, వివేక స్కూల్లో వేడుకలు జరిగాయి.

➡ ముత్తుకూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజలు జరపాలని నారికేళపల్లి పంచాయతీలోని సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ తెలుగు పండిట్, సూక్ష్మ కళాకారుడు సోమ పద్మారత్నం అన్నారు. శుక్రవారం ఆయన విద్యార్థులకు మట్టి విగ్రహాల తయారీపై అవగాహన కల్పించారు.

మట్టి విగ్రహాలను పూజించాలి

వెంకటాచలం: మట్టి వినాయకుని విగ్రహాలను పూజించి, నిమజ్జనం చేయాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్-4, జనతా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇన్‌చార్జి వీసీ చేతుల మీదుగా మట్టి బొమ్మలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దాసరి ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ప్రోగ్రాం అధికారి బి.వెంకటసుబ్బారెడ్డి, డాక్టర్ బి.సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

➡ గ్రామీణ పర్యావరణ వ్యవసాయ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వెంకటాచలం, ఎర్రగుంట గ్రామాల్లో శుక్రవారం మట్టితో తయారు చేసిన వినాయకుడి బొమ్మలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు ఆరుముళ్ల మురళి, స్థానిక నాయకులు మందల మోహన్‌రావు, మందల మణి, బత్తల రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

➡ తోటపల్లిగూడూరు: పల్లెల్లో వినాయక చవితి సందడి నెలకొంది. శుక్రవారం ఉదయం నుంచి నరుకూరు సెంటర్‌లోని విగ్రహాల తయారీ కేంద్రాల వద్ద కొనుగోలుదారుల హడావుడి చేశారు. చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాల విద్యార్థులకు టీచర్ ఫణికుమార్ మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.


➡ బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని మున్సిపల్ కార్మికులకు కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ఆధికారంలో శుక్రవారం సిబ్బంది మట్టి విగ్రహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టితో చేసిన ప్రతిమలను వాడాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.



వెంకటాచలం: ప్రతిమను అందజేస్తున్న నాయకులు



పొదలకూరు: పూజలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



అరచేతిలో గణనాథుడు

ముగ్గురాయితో..

మనుబోలు: మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము శుక్రవారం రంగు ముగ్గు రాయితో అరచేతిలో ఇమిడిపోయే సైజులో బొజ్జ గణపయ్య ప్రతిమను తయారు చేశాడు.



ముత్తుకూరు: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పద్మారత్నం



టీపీగూడూరు: మట్టి విగ్రహాలను పంపిణీ చేసిన టీచర్ ఫణికుమార్

వీఎస్‌యూలో సమావేశం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో శుక్రవారం అనుబంధ కళాశాల ప్రిన్సిపల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన ఏ.బీ.సీ (అపార్ ఐడీ) నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అధ్యాపకులు నిబద్ధతతో పని చేయాలన్నారు. గవర్నమెంట్, యూనివర్సిటీ నుంచి విడుదలైన అకడమిక్ క్యాలెండర్ ప్రకారంగా తరగతులు, పరీక్షల నిర్వహణ, ఇతర ప్రోగ్రాంలు ఉండాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కంటి వైద్య పరీక్షలు



కొడవలూరు: కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైద్యశాఖ ద్వారా పీఎంఓ ఎలు లక్ష్మీప్రసన్న, రాగోమ శుక్రవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎలు శేషుబాయి, సుభాషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలకు సన్నాహాలు

• సూరాయపాళెం వద్ద డంపింగ్ యార్డు

పొదలకూరు: మండలంలోని సూరాయపాళెం పెన్నా నది పరీవాహక ప్రాంతంలో డ్రెడ్జింగ్ పద్ధతిలో ఇసుకను తవ్వేందుకు మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వారం రోజుల్లో ఇసుక డంపింగ్ యార్డుకు పనులు జరుగుతుందని తహసీల్దార్ సారంగపాణి వెల్లడించారు. సూరాయపాళెం ఇసుక రీచ్ వద్ద డ్రెడ్జింగ్ ద్వారా ఇసుకను సేకరించేందుకు ఏర్పాటు చేస్తున్న దారుల పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 5 లక్షల టన్నుల ఇసుకను డ్రెడ్జింగ్ పద్ధతిలో తవ్వి గ్రామ సమీపంలో అనుమతి పొందిన ప్రాంతంలో యార్డును చేర్పనున్నట్లు తెలిపారు. పడవలను కూడా పెన్నానది వద్దకు తరలించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీహరి, సర్వేయర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

• కాగా డంపింగ్ యార్డు నుంచి కొనుగోలు చేసి తరలించేందుకు ధరలు, విధివిధానాలను ప్రకటించలేదు. ముందుగా ఇసుకను యార్డుకు చేర్చిన తర్వాత నిబంధనల ప్రకారం టన్ను ఇసుక తరలింపుకెళ్లేందుకు ధర నిర్ణయించడం జరుగుతుందంటున్నారు. ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వం సంగం వద్ద ఏర్పాటు చేసిన యార్డులో టన్నుకు రూ.380 ధర నిర్ణయించారు. అదే విధంగా సూరాయపాళెం వద్ద ఏర్పాటు చేసే యార్డులో కూడా ఉంటుందంటున్నారు.



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పచ్చ నేతల ఇష్టారాజ్యం

• అనుమతి తీసుకోకుండా పూడికతీత పనుల ప్రారంభం

• చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

విడవలూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలుగుదేశం నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల సొమ్మును దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. అధికారుల అనుమతి, పర్యవేక్షణ లేకుండానే పంట కాలువల మరమ్మతులను చేపట్టారు. కాసుల వేట తప్ప మరొకటి లేదనే ఆరోపణలున్నాయి.

ఎక్కడంటే..

మండలంలోని ఊటుకూరు గ్రామం నుంచి సముద్రంలోకి వెళ్లే కాలువ పూడికతీత పనులను టీడీపీ నాయకులు రెండు రోజులుగా చేయిస్తున్నారు. ఇందుకోసం సంబంధిత ఇరిగేషన్ అధికారుల వద్ద అనుమతి కూడా తీసుకోలేదు. ఆ గ్రామానికి చెందిన కొందరు తెలుగు తమ్ముళ్లు నాలుగు భారీ యంత్రాలతో ఇష్టానుసారంగా పనులు చేయిస్తున్నారు. దీనికి సంబంధించి రానున్న కాలంలో బిల్లులు పెట్టి జేబులు నింపుకొనే ప్రయత్నంలో ఉన్నట్టు సమాచారం. ఈ పనుల వల్ల కాలువకు సమీపంలో ఉన్న తమ పొలాలు దెబ్బతింటాయని చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏం చేయాలంటే..

వాస్తవానికి కాలువ పూడికతీత పనులు చేపట్టాలంటే అధికారులు అంచనా వేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. అనంతరం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే పనులు ప్రారంభించాలి. వాటిని సంబంధిత ఇంజినీరింగ్ అధికారి పర్యవేక్షించాలి. ఎంబుక్ రికార్డు చేసి నిధులు డ్రా చేయాలి. కానీ కోవూరు నియోజకవర్గంలో టీడీపీ నేతలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. అధికారుల అనుమతితో మాకేం సంబంధం లేదన్నట్టుగా పనులు చేస్తున్నారు. పైగా పూడిక తీసిన మట్టిని చిన్న, సన్నకారు రైతుల భూముల్లో వేస్తుండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.



పని చేస్తున్న దృశ్యం

మా దృష్టికి వచ్చింది

కాలువ పనుల విషయం మా దృష్టికి వచ్చింది. వెళ్లి పరిశీలించాం. అనుమతి లేకుండానే పనులు జరుగుతున్నాయని నిర్వాహకులను పిలిచి ఆరా తీశాం. వెంటనే పనులు నిలిపివేయాలని ఆదేశించాం. లేకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– ఖాన్, ఇరిగేషన్ డీఈ

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కోవూరు: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. పడుగుపాడు రైల్వే గూడ్స్ షెడ్ హమాలీల (సీఐటీయూ శాఖ) మహాసభ స్థానిక కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద శుక్రవారం ప్రారంభమైంది. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఎర్ర జెండాను సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగం పెరిగిందన్నారు. ప్రమాదాల్లో అనేకమంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యదర్శి వర్గ సభ్యుడు జి.నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వి.సూర్యనారాయణ, మూలం ప్రసాద్, వి.వేణు, జానా లక్ష్మయ్య, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

వసతుల కల్పనకు కృషి చేస్తా

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. శుక్రవారం పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రహరీ నిర్మించేందుకు స్థల పరిశీలన చేశామన్నారు. విద్యార్థినులకు బెంచీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి బోరు కావాలని టీచర్లు కోరగా, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా త్వరలో వేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

➡ కోవూరు: స్థానిక పచ్చిపాల రామానాయుడమ్మ బాలికోన్నత పాఠశాలను శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత సమస్యలను తన దృష్టికి తెచ్చారని, వాటిని పరిష్కరిస్తామని అరుణమ్మ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, ఎంపీడీఓ శ్రీహరి ఎంపీపీ పార్వతి, ఎంపీటీసీ వేణు తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం: పాఠశాలలో స్థల పరిశీలన చేస్తున్న అరుణమ్మ

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

ముత్తుకూరు: వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ముత్తుకూరు ముస్లిం మైనార్టీలు డిమాండ్ చేశారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బిల్లు వల్ల ముస్లింలు అభద్రతా భావంలో ఉన్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలన్నారు. మసీదుల నిర్వహణ కోసం పెద్దలు ఇచ్చిన భూములను బడాబాబులకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌బాషా, అబ్దుల్ కరీమ్, మన్నాన్, షఫీఉల్లా, ఫయాజ్‌బాషా, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



ముత్తుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయులకు సన్మానం

మనుబోలు: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంతకుమారి జిల్లా స్థాయిలో అవార్డు అందుకోగా శుక్రవారం ఆమెను ఘనంగా సన్మానించారు. పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ సంతోష్‌కుమార్ పాల్గొని ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీచర్లు హసీనా, ఉషాకుమారి, ఉషాదేవి, ప్రియాంక, శ్రీలక్ష్మి, రుక్మిణి, పీడీ ప్రమీలారాణి, అధ్యాపకులు నాగలక్ష్మి, మృదుల, కృష్ణజ్యోతి, రమేష్, శివరాం, కో–ఆప్షన్ సభ్యుడు వీరప్రతాప్ పాల్గొన్నారు.

➡ కొడవలూరు: ఉత్తమ సీఆర్ఎంటీగా ఎంపికైన ఎం.దయాకర్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ కె.స్ఫూర్తి, ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్యలు శుక్రవారం పురస్కారం అందించారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీలు జె.వెంకటరావు, సీహెచ్ లీలయ్య, వి.రమేష్, టీపీ సురేష్, వీరాంజనేయులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది స్వర్ణలత, విజయమ్మ పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట పంచాయతీ పరిధిలో ప్రభుత్వ మద్యం దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డారు. వాచ్‌మెన్ జయరామ్ మధ్యాహ్నం దాడి చేసి దుకాణం తాళాలు పగలగొట్టారు. అందులో ఉన్న రూ.2.60 లక్షల నగదు తీసుకుని పరారయ్యారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్దుబాటు ప్రక్రియను సవరించాలి

నెల్లూరు (టౌన్): 50 కిలోమీటర్లు దాటి సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులను అదే మండలంలో సర్దుబాటు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషు, ప్రధాన కార్యదర్శి చలపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సరైన రవాణా సౌకర్యం లేక మహిళా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇదే విషయమై డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పించామని తెలిపారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం



విడవలూరు: వరిణి అంగన్‌వాడీ కేంద్రంలో..



కొడవలూరు: పోషకాహార పదార్థాల ప్రదర్శన

కొడవలూరు: పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్య దూరమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.విద్యావతి సూచించారు. మండలంలోని మిక్కిలింపేటలో పోషక విలువలున్న ఆహార పదార్థాలను ప్రదర్శించి చూపుతూ గర్భిణులు, బాలింతలకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.చంద్రశేఖర్‌రెడ్డి, మహిళా పోలీసు బాదుల్లాబీ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

➡ విడవలూరు: మండలంలోని వావిళ్ల సెక్టార్ గాదెలదిన్నె సచివాలయం, వరిణి–1 అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ బి.రమణి, ఏఎన్ఎం జయంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు భారతి, చాందిని, జయశ్రీ, శైలజ, లక్ష్మి, శిరీష, వాణి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

➡ మనుబోలు: పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని కొలనకుదురు దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపించారు. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ కోడిగుడ్లు, పాలు, ఆకుకూరలు, తాజా కూరగాయలు, పండ్లు రోజువారి ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాధ, వెంకటరమణమ్మ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

➡ తోటపల్లిగూడూరు: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మాచర్లవారిపాళెం పంచాయతీ ఆమలింగాయపాళెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ కార్యకర్తలు శ్యామల, మాధవి, సుమ, మంజుల తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రమణమ్మ



టీపీగూడూరు: అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది